

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి ముదినేపల్లి మండలం, వడాలి గ్రామానికి చెందిన వీరమల్లు రూ. 1,01,116 విరాళాన్ని అందజేశారు.



దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు.

కరోనా @ జీరో

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం కరోనా పాజిటివ్ కేసులు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా మరణాలు సంభవించలేదు.



న్యూస్‌రీల్

12 నుంచి జాతీయ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు



గుంటూరు వెస్ట్(క్రీడలు): ది సిటీ టెన్నిస్ చాంపియన్‌షిప్స్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 19 వరకు అండర్ – 16 బాల బాలికలకు ఆల్ ఇండియా నేషనల్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తామని కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ రసూల్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 13, 14 తేదీల్లో క్రీడాకారులకు అర్హత పోటీలు నిర్వహిస్తామన్నారు. అర్హత పొందిన వారిని 15 నుంచి 19 వరకు జరగనున్న మెయిన్ టోర్నమెంట్‌లో ఆడిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. టోర్నమెంట్ వలన క్రీడాకారులు తమ ఆల్ ఇండియా ర్యాంకింగ్ మెరుగు పరచుకునే అవకాశముంటుందని చెప్పారు. సమావేశంలో కమిటీ కోశాధికారి గుంటుపల్లి గంగాధరరావు, సహాయ కార్యదర్శి గంగరాజు శేఖర్ కుమార్, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి విల్సన్ బాబు, ప్రధాన కార్యదర్శి గంగరాజు జగదీశ్ చంద్రబాబు, టి.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

అక్రిడిటేషన్లకు 10లోగా దరఖాస్తు చేయండి

నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని పాత్రికేయులకు 2023 – 24 రెండేళ్లకుగాను అక్రిడిటేషన్ల కార్డులు మంజూరు చేసేందుకు సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల కాలపరిమితితో జిల్లాలోని జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల మంజూరు నిమిత్తం జీఓ జారీ చేసిందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు నిమిత్తం www.ipr.ap.gov.in వెబ్‌సైట్ అందుబాటులో ఉందన్నారు. ఆ జీఓ మేరకు జర్నలిస్టులు తమ వివరాలతో పాటు, యాజమాన్యాల సిఫారసు లేఖ, అవసరమైన డాక్యుమెంట్లు పీడీఎఫ్ ఫార్మాట్‌లోను, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, దరఖాస్తుదారు సంతకంతో కూడిన ఫొటో ఫార్మాట్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లు, డౌన్‌లోడ్ చేసిన అప్లికేషన్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను మే నెల 10వ తేదీ లోపల పల్నాడు జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో అందజేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శిగా చంద్రమౌళీశ్వరి బాధ్యతల స్వీకారం



గుంటూరు లీగల్: డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శిగా జి.చంద్రమౌళీశ్వరి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శిగా పనిచేస్తున్న కె.రత్నకుమార్ విశాఖపట్నం ఆరో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ కాగా, విశాఖపట్నం ఆరో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న జి.చంద్రమౌళీశ్వరి గుంటూరు డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శిగా నియమితులైన విషయం విదితమే. ఈ మేరకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత నుంచి బాధ్యతలు స్వీకరించారు. డీఎల్‌ఎస్‌ఏ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

నరసింహుని కల్యాణోత్సవాలు ప్రారంభం



జగ్గయ్యపేట: వేదాద్రిలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గర్భాలయంలో అర్చకులు పరాంకుశం వాసుదేవాచార్యులు, వేదాంతం శేషాచార్యులు, ఆలయ ప్రధానార్చకుడు శ్రీధరాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారిని పెళ్లి కుమారునిగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 522.10 అడుగుల వద్ద ఉంది. ఇది 153.31325 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,800 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 805.40 అడుగుల వద్ద ఉంది.

‘మొక్క’వోని సంకల్పం

మనకు ఆరోగ్య సమస్యలు వస్తే వైద్యుడిని సంప్రదిస్తాం. ఆయన డయాగ్నోస్ చేసి వ్యాధి కారణాలు గుర్తించి తగిన మందులు ఇస్తే వాటితో ఉపశమనం పొందుతాం. ఇదే విధంగా ఇక నుంచి మొక్కలకు అనారోగ్య ఏర్పడితే (తెగుళ్లు సోకితే) వెంటనే డయాగ్నోస్ చేసి తగిన మందులు అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఇందుకోసం మొదటి విడతలో మండల స్థాయిలో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్లు ఏర్పాటు చేస్తుంది.

ఇక మొక్కలకు వైద్యం

- మండల స్థాయిలో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్లు
- పల్లెలకు మొక్కల డాక్టర్లు
- ఆర్‌బీకేల్లో నియామకానికి ప్రభుత్వం చర్యలు
- పంటల చీడ, పీడలకు పీహెచ్‌డీసీల ద్వారా పరిష్కారం



పత్తి మొక్కలు

నరసరావుపేట రూరల్: పాడిపంటలతో పల్లెలు కళకళలాడేలా.. ప్రజలు సిరి సంపదలతో సుఖసంతోషాలతో జీవించేలా.. రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుంది. ఇందులో భాగంగా రైతులు బాగు కోసం పంటల ఆరోగ్యంపై కూడా దృష్టిపెట్టింది. రైతు పొలంలో వేసే ప్రతి పంటకు ఎలాంటి చీడపీడలు ఆశించకుండా బాగా పెరిగి మంచి దిగుబడులు వచ్చేలా చర్యలు తీసుకుంటోంది. గ్రామస్థాయిలో ఉండే వీఏఏలకు సపోర్ట్‌గా పీహెచ్‌డీసీ(ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్స్) డాక్టర్స్‌ను నియమిస్తుంది. వీరు నేరుగా పొలంలోనే రైతులకు సూచనలు, సలహాలు అందించే విధంగా ఏర్పాట్లు చేస్తుంది.

వీఏఏలకు ప్రత్యేక బాధ్యతలు..

ప్రస్తుతం జిల్లాలోని రైతుభరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ) అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారు. వీరు రైతుల పొలాల్లోకి వెళ్లి పంటలకు చీడపీడలు ఏవైనా ఆశించాయా, పైరు ఏపుగా పెరుగుతోందా, వేరుకు పోషకాలు సక్రమంగా అందుతున్నాయా తదితర అంశాలను పరిశీలిస్తారు. పైరు పెరుగుదలలో ఏదైనా సమస్య ఉంటే నేరుగా రైతులకు వివరించి ఏ మందులు వాడాలో తెలియజేస్తారు. ప్రభుత్వం వీరికి సపోర్ట్‌గా కొత్త వారికి నియమిస్తోంది.

పీహెచ్‌డీసీ డాక్టర్ల నియామకం...

ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న వీఏఏల రైతులకు ఎరువులు, పురుగుమందులు, వివిధ రకాల విత్తనాలు అందించే విధంగా విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా వీఏఏలు పొలంలోకి వెళ్లి రైతుల పంటలను పరిశీలించేలా ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. వారికి సపోర్ట్‌గా కొత్తగా వ్యవసాయ విద్య చదివిన వారిని పీహెచ్‌డీసీ(ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్) డాక్టర్లుగా నియమిస్తున్నారు. జిల్లాలో 481 రైతు భరోసా కేంద్రాలుండగా అన్ని ఆర్‌బీకేల్లో పీహెచ్‌డీసీ డాక్టర్లను నియమిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

త్వరలో అందుబాటులోకి...

మొదటి దశలో మండలానికి ఒకటి చొప్పున ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇవి వచ్చే ఖరీఫ్(2023–24)నాటికి రైతులకు అందుబాటులోకి వస్తాయి. ప్రతి మండలంలో సొంత భవనంలో కొనసాగుతున్న రైతు భరోసా కేంద్రాన్ని పీహెడ్‌డీసీగా గుర్తిస్తారు. పీహెచ్‌డీసీ డాక్టర్లుగా మొదటి ప్రాధాన్యత కింద అగ్రికల్చర్ ఎమ్మెస్సీ/హార్టికల్చర్ ఎమ్మెస్సీ చేసిన వారిని ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లుగా ఎంపిక చేస్తారు. ఈ అర్హతలు కలిగిన వారు లేకపోతే అగ్రికల్చర్ బీఎస్సీ/ హార్టికల్చర్ బీఎస్సీ చదివిన వారిని ఎంపిక చేస్తారు. వీరి ఎంపికకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పొలాల్లోకి నేరుగా శాస్త్రవేత్తలు..

వీఏఏలు లేదా పీహెచ్‌డీసీ డాక్టర్లు పొలంలోకి వెళ్లే పంటలకు సంబంధించి ఏదైనా సమస్య ఉండే పూర్తిగా తెలుసుకుని ఆ వివరాలను అటు వ్యవసాయ అధికారుల దృష్టికి, ఇటు శాస్త్రవేత్తలకు సమాచారం ఇస్తారు. సమస్య తీవ్రంగా ఉంటే నేరుగా శాస్త్రవేత్తలే పొలంలోకి వెళ్లి పరిశీలిస్తారు. తెగుళ్ల నుంచి పంటలను కాపాడాలంటే ఎటువంటి చర్యలు తీసుకోవాలో నేరుగా రైతులకు తెలియజేస్తారు. మొత్తంగా రైతులు నష్టపోకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోంది.

త్వరలోనే అమల్లోకి..



ఆర్‌బీకేల్లోని వీఏఏలు రైతుల పొలాల్లోకి వెళ్లి పైరు ఆరోగ్యం పరిశీలించేలా ప్రత్యేక బాధ్యతలను అప్పగించాం. వారికి సపోర్ట్‌గా పీహెచ్‌డీసీలకు డాక్టర్లను తీసుకునే ప్రక్రియ కూడా ప్రారంభించాం. త్వరలోనే నియామకాలు పూర్తిచేసి వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం. దీంతో రైతులకు మరింత మేలు జరిగి, దిగుబడులు పెరుగుతాయి.

– ఐ.మురళీ, జిల్లా వ్యవసాయ అధికారి

రైతులకు ఎంతో మేలు...



రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోంది. ఆర్‌బీకేలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. వాటి ద్వారా కొత్తగా ప్లాంట్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటుచేసి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి సలహాలు, సూచనలు చేసేందుకు అర్హులైన వారిని నియమించేందుకు చర్యలు తీసుకోవడం మంచి పరిణామం.

– గంజి శ్రీనివాసరావు, రైతు, దమ్మాలపాడు, ముప్పాళ్ల మండలం

సుస్థిరాభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట: జిల్లాలో నమోదైన 27 వేల మంది 10 నుంచి 19ఏళ్ల వయస్సుగల కిశోర బాలికలు వివరాలను సమగ్రంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలోని ఎస్‌ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి ఎనిమిది సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కిశోర బాలికలు 63,666 మంది ఉన్నారని, అందులో 11,286 మంది పిల్లలు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడుతున్నారన్నారు. మరో 244 మంది పిల్లలు ఫ్యామిలీ డాక్టర్ ఆధ్వర్యంలో ఉన్నారన్నారు. అదేవిధంగా సంక్షేమ వసతి గృహాల్లో 12,699మంది పిల్లలు ఉండగా, వారిలో 1,540 మంది ఐఎఫ్‌ఏ మాత్రలు వాడుతున్నారని, 412 మంది పౌష్టికాహారాన్ని తీసుకుంటున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ఆధ్వర్యంలో 41 మంది ఉన్నారన్నారు. 10 నుంచి 19 సంవత్సరాలు మధ్య ఉన్న బడి బయట పిల్లలు 27,706 మంది ఉన్నారని, అందులో 7,322 మంది రక్తహీనతతో ఉన్నట్లుగా గుర్తించడం జరిగిందన్నారు. వారిలో 6,882 మంది ఐఎఫ్‌ఏ మాత్రలు వాడుతున్నారని, ఐదుగురు డాక్టర్ పర్యవేక్షణలో ఉన్నారన్నారు. అదేవిధంగా 15 నుంచి 49 ఏళ్ల వయస్సుగల గర్భిణులు 15,749 మంది ఉన్నారని, అందులో 2,266 మంది ఐఎఫ్‌ఏ మాత్రలు వినియోగిస్తుండగా, 1,169 మంది టీహెచ్‌ఆర్ కిట్లను వాడుతున్నారని, 1,770 మంది హాట్ కుక్‌డు మీల్ తీసుకుంటున్నారన్నారు. 565 గర్భిణులు పర్యవేక్షణలో ఉన్నారన్నారు. జీరో నుంచి ఐదేళ్ల వయస్సుగల స్టంటేడ్ చిల్డ్రన్ జిల్లాలో 4,271 మంది ఉండగా, వారిలో 3,772 మంది వైఎస్సార్ సంపూర్ణ పోషణ తీసుకుంటున్నారని, 1,193 మందికి వ్యాక్సిన్ వేయడం జరిగిందన్నారు. మరో 924 మంది పిల్లలు డీవార్మింగ్ మెడిసిన్ తీసుకున్నారని, మరో 1,177 మంది పిల్లలు విటమిన్ ఏ డ్రాప్స్ తీసుకున్నారన్నారు. జీరో నుంచి ఐదేళ్లలోపు అండర్ వెయిట్ పిల్లలు జిల్లాలో 2,553 మంది ఉండగా, వారిలో 2,270 మంది వైఎస్సార్ సంపూర్ణ పోషణ తీసుకుంటున్నారన్నారు. మరో 579 మంది వ్యాక్సిన్ వేయించుకోవడం జరిగిందని, మరో 606 మంది డీవార్మింగ్ మెడిసిన్ తీసుకున్నారన్నారు. వివరాల సేకరణలో వ్యత్యాసం లేకుండా చూడాలన్నారు. తదుపరి సైకిల్‌లో వందశాతం రక్తహీనత పరీక్షలు అందరికీ నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా పలు మొబైల్ యాప్‌లను ఏఎన్‌ఎంల ద్వారా పరిశీలించారు. రానున్న సమీక్ష సమావేశం నాటికి యాప్‌లో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించడం జరుగుతుందన్నారు. డీఆర్‌ఓ కె.వినాయకం, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి.శోభారాణి, డీఈఓ కె.శామ్యూల్, ఐసీడీఎస్ పీడీ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తుకు విశేష స్పందన

- రూ.50 కోట్లు వసూలు
- జీఎంసీ మరో రికార్డు

నెహ్రూనగర్: గుంటూరు కార్పొరేషన్ మరో రికార్డు నెలకొల్పింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.101 కోట్ల డిమాండ్. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ప్రకటించిన విషయం విదితమే. ఆదివారం నాటికి రూ.50 కోట్లు వసూలు చేశారు. నగరపాలక సంస్థ రెవెన్యూ సిబ్బంది, అధికారులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి ప్రత్యేక అభినందనలు తెలిపారు. నగరపాలక సంస్థకు గతేడాది ముందస్తు పన్ను రూ.35.45 కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది రూ.50 కోట్లతో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించామ ని తెలిపారు. రెవెన్యూ వసూళ్లపై సంబంధిత అధికార, సిబ్బందితో నిరంతరం సమీక్షిస్తూ, వసూళ్లకు లక్ష్యాలను నిర్దేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసి, ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని తెలిపారు. గ్రూప్ మెసేజ్, మీడియా, వాల్‌పోస్టర్స్ ద్వారా ముందస్తు పన్ను చెల్లింపు రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు.

పటిష్ట భద్రతకు కట్టు‘బడి’

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్‌లు

- నియామకాలకు ఇటీవల జీఓ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు
- జిల్లా వ్యాప్తంగా 179 జెడ్పీ ఉన్నత పాఠశాలలకు రక్షణ
- నేటి నుంచి విధులకు హాజరు కానున్న నైట్ వాచ్‌మెన్‌లు



నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

సత్తెనపల్లి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. మే నెల ఒకటి నుంచి వాచ్‌మెన్‌లు బాధ్యతలను స్వీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు ఏళ్లుగా వాచ్‌మెన్‌లు లేరు. దీంతో పలు పాఠశాలల్లో ఎన్నో సార్లు చోరీలు జరిగాయి.

కంప్యూటర్లు, ఇతర విలువైన వస్తువులు అపహరణకు గురయ్యాయి. సరస్వతీ నిలయాలైన పాఠశాలల గదులు రాత్రిపూట మద్యం బాబులు, జూదరుల అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. మద్యం మత్తులో ఆకతాయిలు ఆస్తులను, ఫర్నీచర్‌ను ధ్వంసం చేసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఇవే గాకుండా పశువులు పాఠశాలల ఆవరణలోకి చొరబడి నీడనిచ్చే మొక్కలను, పచ్చదనాన్ని ధ్వంసం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. వీటన్నింటిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి మౌనంగా భరించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో పాఠశాలల్లో దొంగతనాల నియంత్రణకు నైట్ వాచ్‌మెన్‌లు (రాత్రి కాపలా దారులను) తాత్కాలిక పద్ధతి పైన నియమించడానికి ప్రభుత్వం ఉపక్రమించింది. ఈనెల 30 లోపు నియమాకాలు పూర్తి చేసి మే ఒకటో తేదీ నుంచి వారు విధులకు హాజరయ్యేలా ఐఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని మండలాల అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు జిల్లాలో 179 పాఠశాలల్లో రాత్రి కాపలాదారులను నియమించాలని మండలాల వారీగా జాబితాలను పంపింది. ఎంపిక బాధ్యత తల్లిదండ్రుల కమిటీలకు, ప్రధానోపాధ్యాయులకు అప్ప జెప్పింది. స్థానికులై ఉండి .. పాఠశాలలో పనిచేసే ఆయా భర్తకు, మధ్యాహ్న భోజనం వంట చేసే మహిళ భర్తకు మొదటి ప్రాధాన్యం.. వారు ముందుకు రాకపోతే 60 ఏళ్ల లోపు ఉన్న మాజీ సైనికోద్యోగులకు.. వారు ఆసక్తి చూపకపోతే తల్లిదండ్రుల కమిటీ బాధ్యత తీసుకుని ఇతరులను నియమించాలని సూచించింది. ఈ షరతుల ప్రకారం నమ్మకంగా పని చేసే వాచ్‌మెన్‌లను ఎంపిక చేసి ఉన్నతాధికారులకు ప్రధానోపాధ్యాయులు పంపారు.

జిల్లాలో నియామకాలు పూర్తి చేశాం

పల్నాడు జిల్లావ్యాప్తంగా 179 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో ఆరు ఉన్నత పాఠశాలలో ఇప్పటికే నైట్‌వాచ్‌మెన్‌లు ఉన్నారు. ఇంకా 173 పాఠశాలలకు నియామకాలు చేయాల్సి ఉంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రధానోపాధ్యాయులు ఇప్పటికే నియామకాలు చేపట్టారు. వీరంతా మే ఒకటి నుంచి విధులకు హాజరు కానున్నారు.

-కె.శామ్యూల్, జిల్లా విద్యాశాఖాధికారి, పల్నాడు

విధులు ఇలా ..

సాయంత్రం పాఠశాల మూసివేసే ముందు విధులకు హాజరై, పనిదినాల్లో మరుసటి రోజు ఉదయం బడి తెరిచే వరకు విధుల్లో ఉండాలి. సెలవు దినాల్లో నిరంతరం కాపలా ఉండాలి.

హెచ్‌ఎం పర్యవేక్షణలో పనిచేయాలి. పాఠశాలకు చెందిన అన్ని ఆస్తులకు రక్షకుడిగా ఉండాలి. ప్రాంగణంలోకి అనధికార వ్యక్తులు రాకుండా చూడాలి. పాఠశాలకు సంబంధించి ఎలాంటి విపత్తులు, ఇతరత్రా సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత హెచ్‌ఎం, పోలీస్, అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం అందించాలి. సాయంత్రం గార్డెన్‌కి నీరు పోయాలి. ఆర్‌ఓ ప్లాంట్ ఉంటే శుభ్రం చేయాలి. పాఠశాలకు సంబంధించిన సామగ్రి తీసుకురావడం, వాటిని హెచ్‌ఎంకు అందించడం, పాఠశాలకు చెందిన ఇతర పనులు ప్రధానోపాధ్యాయుడి సూచనల మేరకు చేయాలి. నెలకు రూ.6 వేలు వేతనం ఇస్తారు.

పర్యాటకులకు ఆహ్లాదం.. ఆనందం

- కొండవీడుకోట నైట్ క్యాంపైన్ లక్ష్యం
- జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరావు
- నైట్ క్యాంపైన్ ట్రయల్‌రన్‌లో డీఎఫ్‌ఓ కుటుంబ సభ్యులు




నైట్ క్యాంపైన్ టెంట్‌లో కుటుంబ సభ్యులతో డీఎఫ్‌ఓ రామచంద్రరావు

యడ్లపాడు: చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కొండవీడు కోటలో నైట్ క్యాంపైన్ ట్రయల్‌రన్ చేసినట్లు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరావు తెలిపారు. కొండవీడు నగరవనం అభివృద్ధి పనుల్లో భాగంగా శనివారం రాత్రి తమ కుటుంబ సమేతంగా నైట్ క్యాంపింగ్ ట్రయల్ రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎఫ్‌ఓ మాట్లాడుతూ కొండవీడు సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాత్రి పూట స్వేచ్ఛగా, ప్రశాంతంగా విడిది చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కొండవీడు వన సంరక్షణ సమితి పర్యవేక్షణలో కొనసాగే ఈ సాహస క్రీడలకు కొండపై 10 టెంట్లను అందుబాటులో ఉంచామన్నారు. ఇవి ఒక్కొక్కటి నలుగురు సభ్యులు బస చేసే సామర్థ్యం కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. రాత్రి బసతో పాటు మరుసటి రోజు మార్నింగ్ వాకింగ్, రాక్ క్లైంబింగ్, రాపెల్లింగ్, ఆర్చ్యరీ, ట్రెక్కింగ్, ట్రామ్పోలిన్ మరికొన్ని ఇతర సాహస క్రీడలను నిర్వహించేందుకు అవుట్‌రైవల్ అడ్వెంచర్స్ సంస్థతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్నట్లు తెలిపారు. నైట్ క్యాంపైన్‌లో డీఎఫ్‌ఓ రామచంద్రరావు, సుస్మిత దంపతులు, వారి ఇద్దరి కుమార్తెలు లక్ష్మీప్రనవ్య, లక్ష్మీ శ్రహస్య ఉన్నారు.

‘ఆస్తమా’ నియంత్రించొచ్చు నేస్తమా!

- అందుబాటులో ఆధునిక వైద్యం
- ఎలర్జీలు, ధూమపానం ప్రధాన కారణం
- మే 2న ఆస్తమా డే



గుంటూరు మెడికల్: మనిషి ఆహారం లేకుండా కొన్ని రోజులు జీవించగలడు.. నీరు లేకుండా కొన్ని గంటలు జీవించగలడు.. అయితే గాలి లేకుండా మాత్రం కొన్ని నిమిషాలు కూడా జీవించలేడు. గాలిలోని ప్రాణవాయువును మన శరీరంలోకి పంపే అవయవమే ఊపిరితిత్తులు. అటువంటి ఊపిరితిత్తులకు ఏదైనా జబ్బు చేసినప్పుడు మనిషి ప్రాణవాయువు కోసం ఇబ్బంది పడతాడు. చలికాలం, వానాకాలం వచ్చిందంటే ఆస్తమా రోగులు తీవ్రంగా భయపడతారు. పూర్వం ఆస్తమాకు మందులు లేవు. ఇప్పుడు మందులు ఉన్నాయి. ఆస్తమాను పూర్తిగా అదుపులో ఉంచవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా ఆస్తమాపై అవగాహన కల్పించేందుకు ప్రతిఏడాది మే మొదటి మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ‘సాక్షి’ అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఆస్తమా లక్షణాలు..

ఆస్తమా సోకిన వారిలో ఒక్కొక్కరికి ఒక్కో విధంగా లక్షణాలు ఉంటాయి. ఒకే రోగి వివిధ సమయాల్లో వేర్వేరు లక్షణాలు కలిగి ఉండటం ఈ వ్యాధి ప్రత్యేకత. రాత్రిపూట, మధ్యరాత్రి, తెల్లవారుజామున తీవ్రమైన పొడి దగ్గు వస్తుంది. ఛాతీ బిగదీసినట్లు ఉంటుంది. పిల్లి కూతలు వస్తాయి. ఆయాసం ఉంటుంది.

కారకాలు...

దుమ్ము, ధూళి, వాతావరణ కాలుష్యం, వాహన కాలుష్యం, వాతావరణ మార్పుల వల్ల ఆస్తమా సోకుతోంది. ముఖ్యంగా వర్షాకాలం, చలికాలంలో ఎక్కువగా ఈ వ్యాధి సోకుతోంది. నవంబరు నుంచి జనవరి వరకు ఎక్కువ కేసులు నమోదవుతాయి. సిగరెట్లు, బీడీపొగ, వంటగదిలో ఘోరు, వాసనలు, దుర్గంధ వాసనలు, సెంట్లు, స్ప్రేలు, శీతల పానియాలు ఆస్తమాకు దారి తీస్తాయి. కొన్ని మందులవలన, పూల పుప్పొడి రేణువులు, సరిపడని ఆహారం తీసుకోవడం, శిలీంద్రాల వలన ఆస్తమా వచ్చే అవకాశం ఉంది.

జిల్లాలో బాధితులు...

జిల్లాలో పల్మనాలజిస్టులు 40 మంది ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతిరోజూ 20 నుంచి 40 మంది ఆస్తమా చికిత్స కోసం సంప్రదిస్తున్నారు. చిన్నవారు మొదలుకొని, వృద్ధుల వరకు అందరిలోనూ ఆస్తమా సమస్య కనిపిస్తోందని పల్మనాలజిస్టులు తెలియజేస్తున్నారు. గోరంట్లలోని ప్రభుత్వ ఛాతీ, సాంక్రమిక వ్యాధుల వైద్యశాలలో చలికాలంలో ప్రతిరోజూ 50 మంది వరకు, ఇతర రోజుల్లో ప్రతిరోజూ పది మందికి పైగా ఆస్తమా బాధితులు చికిత్స పొందుతున్నారు.

తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు...

శ్వాస తీసుకోవడం అతికష్టం అవుతుంది. మాటలు చెప్పడం పూర్తి చేయలేరు. నడిస్తే ఆయాసం వస్తుంది. కూర్చున్నా, పడుకొన్న, దగ్గు, ఆయాసం. చెమటలు పడతాయి, భయం, ఆందోళన, చివరికి పెదవులు, ముఖం నీలంగా మారతాయి. ఆస్తమా తీవ్రంగా ఉన్నప్పుడు నిబ్బరంగా ఉండాలి. గాబరా పడకూడదు. పక్కనున్న వారు ధైర్యం చెప్పాలి. డాక్టర్ ఇంతకు ముందు రాసిన మందులు వాడాలి, వెంటనే డాక్టరును సంప్రదించాలి.

అన్ని అధ్యయనాల్లో తేలిన విషయాలు...

- పది మంది రోగులలో 8 మందికి జలుబు, వైరస్‌లే ఆస్తమాకు కారణాలు.
- పది మంది ఆస్తమా రోగుల్లో ఏడుగురికి పొగతాగుట, పొగ వలన వస్తుంది.
- పది మంది ఆస్తమా రోగుల్లో ఆరుగురికి చల్లటి గాలుల ద్వారా వస్తుంది.
- పది మంది ఆస్తమా రోగుల్లో ఏడుగురికి ఇంట్లో ధూళి వల్ల, నలుగురికి వాయు కాలుష్యం ద్వారా, ఐదుగురికి పూల పుప్పొడి రేణువుల ద్వారా, ఎనిమిది మందికి పెంపుడు జంతువుల వెంట్రుకల ద్వారా ఆస్తమా వస్తుంది.

ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ..



మసాలాలు, శీతల పానియాలు, చాక్లెట్లు తినకూడదు. దుమ్ము, ధూళి, ఘాటు వాసనలు, సెంట్లు, స్ప్రేలకు దూరంగా ఉండాలి. చల్లని నీటితో తల స్నానం చేయకూడదు. పరుపులు, దిండ్లు దుమ్ము, ధూళి లేకుండా శుభ్రంగా ఉండాలి. చలిగాలిలో తిరగకూడదు. గోరువెచ్చని నీరు తాగాలి. గోంగూర, వంకాయ వంటి పడని పదార్థాలు తినకూడదు. పిల్లి, కుక్క వంటి పెంపుడు జంతువులకు దూరంగా ఉండాలి. ఇంట్లో దుమ్ము, ధూళి, బూజు వంటివి లేకుండా చూసుకోవాలి. పొగతాగరాదు, మద్యపానం సేవించరాదు.

– డాక్టర్ బి.దుర్గాప్రసాద్, పల్మనాలజిస్టు

ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవలు



గోరంట్లలోని ప్రభుత్వ ఛాతీ, సాంక్రమిక వ్యాధుల వైద్యశాలలో ఆస్తమా బాధితులకు అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నాం. వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు, అన్ని ఉచితమే. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నియంత్రణలో పెట్టవచ్చు. ముఖ్యంగా చలికాలంలో వ్యాధిసోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఏమైనా లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ శ్రీకంటి రఘు, ఆసుపత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

చరిత్రలో తొలిసారి వడ్డెర్లకు ప్రాధాన్యం

నరసరావుపేట: ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా వడ్డెర్ల తరఫున ఎమ్మెల్సీగా పెద్దల సభలోకి చంద్రగిరి ఏసురత్నంకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పలువురు వడ్డెర సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక పెద్ద చెరువులోని వడ్డే రాజుల కమ్యూనిటీ హాల్‌లో పట్టణ అధ్యక్షులు చల్లా హనుమంతరావు అధ్యక్షతన ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏసురత్నంకు సన్మానసభ నిర్వహించి ఐక్యతను చాటాలని నిర్ణయించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు, బిల్డర్స్, కాంట్రాక్టర్స్, ఉద్యోగస్తులు పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి వేముల పాండు పాల్గొన్నారు.

పిడుగుపడి ఎండీయూ ఆపరేటర్ మృతి

బయ్యవరం(క్రోసూరు): మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన ఎండీయూ ఆపరేటర్ కడియం వెంకట్రావు(38) పొలాల్లో ఉండగా పిడుగుపడి ఆదివారం మృతి చెందాడు. ఎస్ఐ మణికృష్ణ తెలిపిన వివరాలు.. మండలంలోని బయ్యవరం నుంచి హుస్సేన్ నగరం గ్రామ మార్గమధ్యంలో మర్రి చెట్టుకింద వెంకట్రావు, మరో ఇద్దరు, జీవాలతో కూర్చుని ఉన్నారు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో పిడుగు పడటంతో ఎండీయూ ఆపరేటర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరు షాక్‌కు గురై కొద్దిసేపటి తరువాత క్షేమంగా బయటపడ్డారు. మృతదేహాన్ని అమరావతి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కొరకు తరలించినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

లయన్స్ క్లబ్‌కు సేవే సక్సెస్ మంత్రం

– మంత్రి ఆర్కే రోజా

సాక్షి, అమరావతి: లయన్స్ క్లబ్‌కు సేవే సక్సెస్ మంత్రంగా పని చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజ శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆదివారం బెంగళూరులోని లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో 17వ వార్షిక డిస్ట్రిక్ట్ కన్వెన్షన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం సభ్యుల వినతి మేరకు క్లబ్‌లో సభ్యురాలిగా మంత్రి సభ్యత్వం తీసుకోవడానికి అంగీకరించారు. కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వినిత ప్రకాశ్, సీఎస్ఆర్ సౌత్ ఇండియా అంబాసిడర్ కృష్ణారెడ్డి, భక్తవత్సల రెడ్డి, బుజ్జంగౌట్టి, రామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సేద్యం విభాగం విజేత ఇనిమెళ్ల ఎడ్లజత


ఎడ్ల బలప్రదర్శన జరుగుతున్న దృశ్యం

దాచేపల్లి: వీర్ల అంకమ్మతల్లి కొలుపుల సందర్భంగా సేద్యం విభాగంలో ఎడ్లబల ప్రదర్శన పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ విభాగంలో పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం ఇనిమెళ్లకు చెందిన కటకం వెంకటేశ్వర్లు ఎడ్ల జత నిర్ణీత సమయంలో 6,065 అడుగుల దూరం బండ లాగి మొదటి స్థానంలో నిలిచింది. ప్రకాశం జిల్లా కురిచేడు మండలం కాటంవారి పల్లెకు చెందిన కాటం పెద్దిరెడ్డి ఎడ్లజత 6,000 అడుగుల దూరం లాగి రెండో స్థానంలో, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శిరిష్ చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత 5,562 అడుగుల దూరం లాగి మూడో స్థానంలో, ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన జంగా విజయ్‌భాస్కర్‌రెడ్డి ఎడ్లజత 5453 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పమిడిపద్రుకు చెందిన యర్రసాని వీరయ్య, గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం 113 తాళ్లూరుకి చెందిన కళ్లం హుస్సేన్‌రెడ్డి సంయుక్త ఎడ్లజత 5149 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో, పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాలకు చెందిన సంకురాత్రి పూర్ణయ్య ఎడ్లజత 5046 అడుగుల దూరం బండను లాగి ఆరో స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేల నగదు షీల్డ్‌ను దాతలు అంబటి శేషగిరిరావు, తోట రోశయ్య, శూరం నాగేశ్వరరావు, మామిడి రాము, ఎలిశెట్టి వెంకట రమేష్, అనిశెట్టి శ్రీనివాసరావు, రమేష్, అనిశెట్టి శ్రీనివాసరావు, మునగా నిమ్మయ్య, బచ్చు సుధీర్, గండ్రికల సైదారావు, బొజ్జా ఆంజనేయులు విజేతలకు అందించారు. పోటీలకు న్యాయనిర్ణేతగా దుర్గి శ్రీనివాసరావు వ్యవహరించగా కమిటీ సభ్యులు కొప్పుల గిరి, దిలీప్, కుమార్, శ్రీనివాసరావు, అంబటి నవకుమార్ పరిశీలించారు. రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో జరుగుతున్న ఈ పోటీలను తిలకించేందుకు రైతులు భారీగా వచ్చారు.

మాచవరం పోటీల్లో..

మాచవరం: మండలంలోని కొత్తపాలెంలో శ్రీగంగా పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బలప్రదర్శన బండ లాగుడు పోటీల్లో ఆదివారం నిర్వహించిన సేద్యపు విభాగంలో (న్యూ కేటగిరి) పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం, ఇనిమెట్ల గ్రామానికి చెందిన కటకం వెంకటేశ్వర్లుకు చెందిన ఎడ్ల జత 4835.10 అడుగుల దూరాన్ని లాగి ప్రథమం స్థానంలో నిలిచాయి. కాటం పెద్దిరెడ్డి (కాటంవారిపల్లె, కురిచేడు మండలం,ప్రకాశం జిల్లా) ఎడ్లు 4652.3 అడుగులు లాగి రెండవ స్థానంలో, అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి (వేటపాలెం, చుండూరు మండలం, బాపట్ల జిల్లా) ఎడ్లు 4552 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. మరసాని సుబ్బయ్య (పమిడిమర్రు, నరసరావుపేట మండలం) హుసేన్‌రెడ్డి (113 తాళ్లూరు, పెదకూరపాడు మండలం) కంబైన్డ్ ఎడ్ల జత 3773.9 అడుగులు లాగి నాలుగో స్థానం, జంగా విజయభాస్కర్‌రెడ్డి (చీమకుర్తి, ప్రకాశం జిల్లా) ఎడ్లు 3251.6 అడుగులు లాగి 5వ స్థానం దక్కించుకొని, బహుమతులు అందుకున్నాయి.

ఏసీఏ స్టేడియంలో త్వరలోనే అంతర్జాతీయ మ్యాచ్‌లు

– ఏసీఏ మంగళగిరి అకాడమీ ఛైర్మన్ కేవీ పురుషోత్తం


ఏసీఏ మంగళగిరి అకాడమీ ఛైర్మన్ కేవీ పురుషోత్తంను సత్కరిస్తున్న అకాడమీ సభ్యులు

మంగళగిరి: మంగళగిరి ఏసీఏ స్టేడియంలో త్వరలోనే అంతర్జాతీయ మ్యాచ్‌లు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆంధ్రా క్రికెట్ మంగళగిరి అకాడమీ ఛైర్మన్ కేవీ పురుషోత్తం తెలిపారు. కొత్తగా ఎన్నికైన ఏసీఏ మంగళగిరి అకాడమీ ఛైర్మన్ పురుషోత్తం, కన్వీనర్ రమేష్‌కుమార్ నగరంలోని ఆంధ్రా క్రికెట్ అకాడమీ కార్యాలయంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ కోర్టు కేసు వల్ల స్టేడియం పనులు కొద్ది రోజులు నిలిచిపోయాయని, త్వరలోనే కేసులను పరిష్కరించుకుని మిగిలిన నిర్మాణ పనులు పూర్తికి తమ వంతు కృషి చేస్తామన్నారు. క్రికెట్‌లో లోకల్ టాలెంట్‌ను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడు అకాడమీలు ఉండగా మంగళగిరిలోని ఏసీఏ అకాడమీ ఛైర్మన్‌గా తనను నియమించారని వెల్లడించారు.. ఇంటర్నేషనల్ స్టాండర్డ్‌తో స్టేడియాన్ని తీర్చిదిద్దుతామన్నారు. కన్వీనర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ మంగళగిరిలోని ఏసీఏ క్రికెట్ స్టేడియాన్ని బీసీసీఐ గుర్తించిందని, కాబట్టే ఇక్కడ తరచూ కొన్ని అంతరాష్ట్ర క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నాయని తెలిపారు. క్రికెట్‌లో టాలెంట్ ఉన్న వారిని గుర్తించి వారికి శిక్షణ ఇవ్వడంతో పాటు విద్యాభ్యాసం కూడా అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రా క్రికెట్ అకాడమీ జాయింట్ సెక్రటరీ ఎ.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

దుక్కి దున్ను.. భూసారం పెంచు

వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనాలు

కొరిటిపాడు(గుంటూరు): రైతులు పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలి. లేదంటే దిగుబడులు తగ్గి నష్టపోయే ప్రమాదం ఉంది. క్రమం తప్పకుండా ఒకే విధానంలో వ్యవసాయం చేయటం, ఒకే రకమైన పంటలను సాగు చేయడం వలన భూమిలో సారం తగ్గిపోయే అవకాశం ఉంటుంది. దీన్ని అధిగమించడానికి వేసవి దుక్కులు దోహదపడతాయని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించాల్సిన పంటలపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. అందుకు తగ్గట్టుగా పంటల ఎంపిక, విత్తన సేకరణ చేయాలని స్పష్టం చేస్తున్నారు. భూసారాన్ని పెంచుకోవడానికి వేసవి దుక్కులు ఉపయోగపడతాయని చెబుతున్నారు. తొలకరి వర్షాలకు ముందుగా భూమిని లోతుగా దున్నటం వలన చీడపీడల నివారణకు భూమి సహకరిస్తుందని, వేసవి దుక్కులు దున్నడం ద్వారా భూమి లోపల ఉన్న సూక్ష్మజీవులు పైకి వచ్చి నశిస్తాయని, తద్వారా రైతులకు మేలు చేకూరుతుందని వివరిస్తున్నారు.



వాలుకు అడ్డంగా...

వేసవి దుక్కులు వాలుకు అడ్డంగా లోతుగా చేపట్టాలి. ఈ విధంగా చేయడం వలన వర్షాలు పడినా భూమిలో సారం బయటకు కొట్టుకుపోకుండా ఉంటుంది. పొలం గుల్లగా ఉండటం వలన వర్షాలు కురిసే సమయంలో ఆ నీరు భూమిలో ఇంకిపోతుంది. దీని వలన భూ అంతర్భాగంలో నీటి నిల్వలు చెక్కు చెదరవు. తేమను నిలుపుకునే సామర్థ్యం పెంచేందుకు దుక్కుల సమయంలో పశువుల పేడ చల్లి ఎద్దులతో దున్నటం మంచి పద్ధతి. దీని వలన భూసారం కూడా పెరుగుతుంది. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులు ఈ విధానంపై దృష్టి పెట్టాలి. వేసవిలో లోతుగా భూమిని దున్నుకోవడం వలన కలుపు నివారణ సులభతరం అవుతుంది. పంటల కాలం పూర్తయిన తరువాత భూమిని వదిలేయడంతో కలుపు మొక్కలు పెరిగి భూసారాన్ని పీల్చుకుంటాయి. ఈ దశలో వేసవి దుక్కులు చేయడంతో భూమికి నష్టపరిచే కీటకాలు, గుడ్లు, శిలీంద్రాలు, చీడపీడ కారకాలు బయటపడి అంతరించిపోతాయి.

రైతులు దృష్టి పెట్టాలి..



వేసవి దుక్కులపై రైతులు దృష్టి సారించాలి. ప్రస్తుత సీజన్‌లో వేసవి దుక్కుల కారణంగా పంటల కాలం ముగిశాక భూ అంతర్భాగంలో దాక్కుని ఉన్న కీడు చేసే సూక్ష్మజీవులు, శిలీంద్రాలు నశిస్తాయి. తొలకరి వర్షాలతో వచ్చే నీరు భూమిలో నిలవడంతో పాటు తేమ చేకూరి వేసే ప్రతి విత్తనం మొక్కగా మారేందుకు సహకరిస్తుంది. బీడుగా ఉన్న భూములను రైతులందరూ తప్పకుండా లోతైన సేద్యం చేసుకోవాలి.

–నున్న వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి.

ఈతను మించిన వ్యాయామం లేదు

తాడేపల్లిరూరల్: ఈతను మించిన వ్యాయామం లేదని ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఏపీహెచ్ఆర్‌డీఐ ఆర్.పి.సిసోడియా చెప్పారు. ఆదివారం ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఉన్న ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఈత శిక్షణ శిబిరాన్ని లైలా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ గోకరాజు ఆదిత్యవర్మతో కలిసి సిసోడియా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బాలబలికలు ఈతను నేర్చుకోవాలని, దీనివల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని వివరించారు. పిల్లలకు ఈత శిక్షణ ఇప్పిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షులు వెలగపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తర్ఫీదు పొందిన కోచ్‌లతో ఈత నేర్పిస్తున్నామని, శిక్షణ అనంతరం ప్రతి ఒక్కరికీ గుడ్డు, పాలు, బిస్కెట్లు ఇస్తామని వివరించారు. డెకథ్లాన్ సౌజన్యంతో శిక్షణ శిబిరంలో పాల్గొన్న పిల్లలందరికీ వాటర్ బాటిల్స్ అందజేయనున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ, కార్యదర్శి మందపాటి నరసరాజు, సహాయ కార్యదర్శి డాక్టర్ ఓబుల్‌రెడ్డి, కోశాధికారి వెంకట సుబ్బారావు, ఈవెంట్ కన్వీనర్ యు.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలుగు సినిమా పాటల పోటీ విజేత వెంకటేశ్వర్లు


విజేతలను సత్కరిస్తున్న సంస్థ బాధ్యులు

సత్తెనపల్లి: జాతీయ స్థాయి తెలుగు సినిమా పాటల పోటీల్లో నాదెండ్లకు చెందిన సిహెచ్.వెంకటేశ్వర్లు ప్రథమ స్థానం సాధించి విజేతగా నిలిచారు. చైతన్య కళా స్రవంతి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం జాతీయ స్థాయి తెలుగు సినిమా పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు కళాకారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పోటీల్లో ద్వితీయ స్థానం పి.రవికుమార్(నరసరావుపేట), తృతీయ స్థానం ఆర్.నాగరాజు (గుత్తికొండ), కైవసం చేసుకున్నారు. అలాగే కన్సోలేషన్ బహుమతుల్లో కేవీఎస్ వీడీ ప్రసాద్(పాలకొల్లు), జి.రాజ్‌కుమార్(చిలకలూరిపేట), సిహెచ్.హనుమంతరావు(నరసరావుపేట), ఎ.కోటేశ్వరరావు(సత్తెనపల్లి), జే కోటేశ్వరరావు(పెదనందిపాడు), ఎం.నాగరాజు(పిడుగురాళ్ల), వై.ఏసుదాసు(కావూరు), తోట సుబ్బారావు(అంచులవారిపాలెం), పి.రాజు(గణపవరం), షేక్ అబ్దుల్ గని (గుత్తికొండ) కైవసం చేసుకున్నారు. అనంతరం సంస్థ బాధ్యుడు ముట్లూరి వెంకయ్య అధ్యక్షతన బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు చేసుకున్న కళాకారులను పూలమాలలతో సత్కరించి నగదు, షీల్డ్‌లను బహూకరించారు. కన్సోలేషన్ బహుమతులు సాధించిన కళాకారులకు నగదు, షీల్డ్‌లను అందించారు. కార్య క్రమంలో చైతన్య కళాస్రవంతి అధ్యక్షుడు కమతం శ్రీనివాసరావు, ఏపీ సెక్రటరీయేట్ లో గ్రూప్–1 అధికారి కోట.వెంకటేశ్వర్లు, కంబాల వెంకటేశ్వర్లు, హిందీ ఉపాధ్యా యుడు ఎం.సుభాని, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు మంచికంటి వెంకటేశ్వరరావు, చైతన్య కళా స్రవంతి కార్యదర్శి గుండవరపు అమర్‌నాథ్ పాల్గొన్నారు.

నేటి నుంచి సొలస రంగనాథుని కల్యాణోత్సవాలు

- వారం రోజులు పాటు భక్తుల సందడి
- వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం


గర్భాలయంలోని శ్రీభూసమేత రంగనాయకస్వామి

యడ్లపాడు: శ్రీభూసమేత రంగనాయక స్వామి ఆలయం ఒకటి. ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభ కానున్నాయి. కొండవీడు ప్రాంతంలోని అత్యంత ప్రాచీనమైన ఆలయాలలో సొలస గ్రామంలోని ఆలయం ఒకటిగా ఉంది. అర్చకులు పి రామకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఒకటో తేదీ ఉదయం 8 గంటలకు స్వామి వారిని పెండ్లి కుమారుని చేయడంతో ప్రారంభమై ఏడో తేదీన రాత్రి 8 గంటల పవళింపు సేవతో వారంరోజుల కల్యాణ వేడుకలు ముగుస్తాయి. 4వ తేదీన శ్రీదేవి, భూదేవి రంగనాథుల కల్యాణం అన్నదానం ఉంటుంది. కార్యక్రమాలను వంశాపారంపర్య ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, అర్వపల్లి బ్రదర్స్, ఆలయ ఈఓ సీహెచ్ శివయ్య ఆయా కార్యక్రమాల్ని పర్యవేక్షించనున్నారు.

జూన్ 7న రామాలయ ప్రతిష్టా మహోత్సవం

హాజరుకానున్న త్రిదండి చినజీయర్‌స్వామి


గణపవరంలో రూ.2.5కోట్ల వ్యయంతో నిర్మించిన రామాలయం

నాదెండ్ల: గణపవరంలో రూ.2.5కోట్లతో నిర్మించిన శ్రీరామాలయ ప్రతిష్టా మహోత్సవం ఈ ఏడాది జూన్ ఏడో తేదీన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం వివరాలను ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ప్రతిష్ఠ మహోత్సవానికి త్రిదండి చినజీయర్ స్వామి హాజరుకానున్నట్లు చెప్పారు. మే 31న జరగాల్సిన ప్రతిష్టా మహోత్సవం సాంకేతిక కారణాలతో జూన్ ఏడో తేదీకి వాయిదా పడినట్లు వివరించారు. జూన్ 3వ తేదీ నుంచి ఆలయ సమీపంలో వేసిన చలువ పందిళ్లలో తిరుమల తిరుపతి దేవస్థానం వేదపాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస దీక్షితులు, మరో పదహారు మంది వేద పండితుల ఆధ్వర్యంలో క్రతువు కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఏడో తేదీ ఉదయం 7.43 గంటలకు సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరాముడు, కన్యకాపరమేశ్వరి, గణపతి విగ్రహ ప్రతిష్ఠతో పాటూ జీవధ్వజస్తంభం, కలశ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ఉదయం 11 గంటల నుంచి సుమారు 40 వేల మందికి భారీ అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి కృషి

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి


స్టేడియం క్రీడాకారులకు ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

గుంటూరు వెస్ట్(క్రీడలు): స్టేడియాలు, మైదానాలు చిన్నారులు, క్రీడాకారులతో నిండిపోవాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పమని, ఆ దిశగా స్థానిక ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణాన్ని నగరానికే మకుటాయమానంగా తీర్చిదిద్దుతున్నామని శాసన మండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలో అప్పిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే బాస్కెట్ బాల్ స్టేడియం నిర్మించామని పేర్కొన్నారు. ఆధునిక వసతులతో జిమ్, వాకింగ్ ట్రాక్‌నూ త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. వాకింగ్ ట్రాక్ కొన్ని ప్రత్యేకలతో రూపుదిద్దుకుంటుందని చెప్పారు. చుక్కనీరు కూడా ట్రాక్‌పై పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. దీంతోపాటు చిన్నారులకు క్రీడా పోటీలు నిర్వహించే వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. నగరం నడిబొడ్డున ఉన్న ఈ స్టేడియం అభివృద్ధికి అందరి సహకారం ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం తిరుపతిలో జరగనున్న సీఎం కప్ రాష్ట్ర పోటీల్లో పాల్గొనే స్టేడియం క్రీడాకారులకు ఆర్థిక చేయూతనందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు, జీఎంసీ డీసీ చెరువు శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఈచంపాటి ఆచారి, షేక్ రోషన్, నగేష్, మన్నెం కిషోర్, వై.కిషోర్ పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు

తెనాలిరూరల్: స్థానిక చెంచుపేటలోని అన్నాబత్తుని సత్యనారాయణ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి బ్యాట్మింటన్ పోటీలు ఆదివారం కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో అంగలకుదురు గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, సునీల్, సర్పంచ్ కనగాల నాగభూషణం తదితరులు పాల్గొని పోటీలను ప్రారంభించారు. స్టేడియం ఇన్‌చార్జ్ గాదె శ్రీనివాస్ నేతృత్వంలో 17 నుంచి 45 ఏళ్లలోపు మెన్స్ డబుల్స్, 42 నుంచి 70 సంవత్సరాల లోపు వెటరన్స్ డబుల్స్, అండర్–15 బాలురు, బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తుండగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పోటీలు ఎంతో ఆసక్తికరంగా సాగాయి. వీటిలో మెన్స్ డబుల్స్ పోటీలకు సంబంధించి మొదటి బహుమతి రూ.8,116, ద్వితీయ బహుమతి రూ.ఐదు వేలను వీరవల్లి మురళీ అందజేశారు. మురళీ మాట్లాడుతూ తెనాలి ప్రాంతంలో అన్ని వసతులతో ఏఎస్ఎన్ ఇండోర్ స్టేడియం క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చక్కటి వాతావరణంలో అన్ని వయస్సుల వారు ఇక్కడ క్రీడలను ప్రాక్టీస్ చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి తల్లి, తండ్రి కూడా తమ పిల్లలను క్రీడలలో ప్రోత్సహించాలని సూచించారు. సునీల్, కనగాల నాగభూషణం తదితరులు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బాజి, రమేష్‌రెడ్డి, ఆర్గనైజర్స్ గాదె శ్రీనివాస్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. శాతకర్ణి స్టిక్ ఫైటింగ్ అకాడమీ ద్వారా ఇక్కడ విద్యార్థులకు కర్రసాము శిక్షణ ఇస్తుండగా వాటిని వారు పరిశీలించారు. కొద్దిసేపు కర్రసాము చేస్తూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

ఆత్మవిశ్వాసంతో పనిచేస్తే విజయం సాధ్యం

గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు

సాక్షి, అమరావతి: ఆత్మవిశ్వాసంతో పని చేస్తే విజయం తప్పక వరిస్తుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. ఆదివారం నాగార్జున వర్సిటీలో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'విజయవంతమైన విద్యలో సైకాలజిస్టుల పాత్ర, చౌరవ అంశంపై అంతర్జాతీయ సెమినార్ నిర్వహించారు. శేషగిరిరావు మాట్లాడుతూ.. మనస్సును అదుపు చేసుకున్న వ్యక్తి ఏ రంగంలోనైనా రాణిస్తారన్నారు. మేధో పరమైన అవగాహన వెనుకాల తగిన అనుభవ పూర్వక ఆలోచనలు కూడా ఉండాలని.. అప్పుడే తెలివి తక్కువ పనుల వైపు మనసు వెళ్లదన్నారు. స్పందన ఫౌండేషన్ ఛైర్మన్ ఈదా శామ్యూల్ రెడ్డి సమాజాన్ని మానసిక అస్థిత్వం నుంచి స్థిరత్వం వైపు నడించాలని చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉత్తమ ప్రదర్శన 'నాన్న నే వచ్చేస్తా'

ముగిసిన వైఎస్సార్ నాటక కళాపరిషత్ జాతీయస్థాయి నాటికల పోటీలు


ప్రథమ బహుమతిని గెలిచిన 'నాన్న నే వచ్చేస్తా' నాటికలో సన్నివేశం

తెనాలి: స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నాలుగురోజులపాటు జరిగిన డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్ జాతీయస్థాయి ద్వితీయ ఆహ్వాన నాటికల పోటీల్లో అమృతలహరి థియేటర్ ఆర్ట్స్, గుంటూరు వారి 'నాన్న నే వచ్చేస్తా' ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ఇదే నాటికలో ముఖ్యపాత్రల్లో నటించిన అమృతవర్షిణి, జి.లహరి ప్రదర్శనకు దర్శకత్వం వహించారు. ఉత్తమ నాటక రచయిత తాళాబత్తుల వెంకటేశ్వరరావు, ఉత్తమ నటిగా అమృతవర్షిణి ఎంపికయ్యారు. శనివారం రాత్రి పొద్దుపోయాక జరిగిన ముగింపు సభకు తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షత వహించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులుతో కలిసి ఎమ్మెల్యే శివకుమార్ బహుమతులు ప్రదానం చేశారు.

కళాంజలి, హైదరాబాద్ వారు ప్రదర్శించిన 'రైతేరాజు' నాటిక ఉత్తమ ద్వితీయ ప్రదర్శన బహుమతిని గెలుచుకోగా, మైత్రీ కళానిలయం, విజయవాడ వారి 'ఇతిహాసం' నాటిక ఉత్తమ తృతీయ ప్రదర్శనకు ఎంపికైంది. రైతేరాజు నాటిక దర్శకుడు కొల్లా రాధాకృష్ణ ఉత్తమ దర్శకుడు బహుమతిని స్వీకరించగా, మనసున మనసై నాటికలో బాలసుబ్రహ్మణ్యం పాత్రధారి విజయకుమార్ ఉత్తమ నటుడు అవార్డును అందుకున్నారు. ద్వితీయ ఉత్తమ నటుడిగా స్వరకమలాలు నాటికలో నటించిన కె.శ్యాంప్రసాద్, ద్వితీయ ఉత్తమ నటిగా ఇతిహాసంలో నటించిన ఆర్.రాజేశ్వరికి బహుమతులు దక్కాయి. ఉత్తమ కారెక్టర్ నటుడిగా కావూరి సత్యనారాయణ, క్యారెక్టర్ నటిగా రత్నకుమారి, ఉత్తమ విలన్‌గా ఎ.రామానుజం, ఉత్తమ హాస్యనటుడిగా శీరం శ్రీనివాసరావు (మనసున మనసై) బహుమతులను అందుకున్నారు. ఉత్తమ సంగీతం బహుమతి రైతేరాజుకు సంగీతం సమకూర్చిన సురభి నాగరాజుకు లభించింది. ఉత్తమ ఆహార్యం బహుమతి ఐదు పదులు నాటికకు, ఉత్తమ రంగాలంకరణ బహుమతి ఇతిహాసం నాటికకు దక్కాయి. జ్యూరీ బహుమతులను మనసున మనసై నాటిక, పున్నయ్యచౌదరి (ప్రక్షాళన), డి.రమేష్ (రైతేరాజు) అందుకున్నారు. న్యాయనిర్ణేతలుగా ఎ.నర్సిరెడ్డి, బొర్ర నరసయ్య ప్రసాద్‌రెడ్డి వ్యవహరించారు. కళాపరిషత్ నిర్వాహకులు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, ఆరాధ్యుల కన్నా, పిట్టు వెంకట కోటేశ్వరరావు పర్యవేక్షించారు.